1993
నుండి
వెలువడుతున్నది

నెగ్గిక : ఒల్లాపి
(విజయ : జ్యేష్ఠము)

జూన్ 2013

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

• నుడి • నాడు • నెనరు

15 రూ.





గిడుగు, గురజాడల సాక్షిగా ఉద్యమబాట పట్టాల్సిందే...

# భారతదేశంలో టెలికాం విప్లవం:పొంచియున్న ముప్పు

మే 17ను ప్రపంచ టెలికాం మరియు సమాచార సమాజ దినోత్సవంగా ప్రపంచమంతటా పాటిస్తారు. ఆయా దేశాల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీలు ఏవిధంగా అభివృద్ధి చెందుతూ, అన్ని వర్గాల ప్రజలకు, వివిధ రంగాల్లో ఎలా ఉపయోగ పడుతున్నాయన్న విషయాలను సమీక్షించడంతో పాటు మానవ సమాజ వికాసానికి ఈ టెక్నాలజీ లను ఇంకెంతగా ఉపయోగించుకోవచ్చో అలా చేయడానికి ఎటువంటి ప్రణాళికలు చేపట్టాలో అనే అంశంపై ఆ రోజున చర్చాగోష్ఠులు నిర్వహించ బడుతాయి. ఈ సంవత్సరం - విశేష చర్చనీయాం శం రోడ్డు, రైల్వేప్రయాణాల్లో దుర్ఘటనలు జరుగ కుండా ఉండటానికి, ఆయా వాహనాల్లో కంప్యూ టర్స్, టెలికమ్యూనికేషన్స్ ఏ మేరకు ఉపయోగిస్తు న్నారో అనేది. కార్లల్లో, లారీల్లో, రైల్వే ఇంజన్లలో ఇంధనాన్ని ఆదాచేయటానికి, దుర్ఘటనలను వారించడానికి, మార్గదర్శనం చేయడానికి, దుర్ఘ టనగ్రస్తులకు తక్షణ వైద్య సహాయం చేయడానికి, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్స్ టెలికాంల ప్రయోగంలో ప్రగతి సమీక్షింపబడుతుంది. మనదేశంలో టెలికాం వ్యవస్థ ఎలా వికసించిందో, ముందున్న సమస్య లేమిటో విశ్లేషించుకొందాం. పి.వి. నరసింహారావు గారి ప్రధానమంత్రిత్వ కాలంలో, టెలికాం వ్యవస్థ క్రొత్తరూపురేఖలను సంతరించుకోనారంభించింది. ప్రభుత్వ గుత్తాధి పత్యాన్ని తొలగించి, ప్రైవేటు పెట్టుబడుల నాహ్వా నించి, పోటీ కంపెనీల కవకాశం ఇవ్వడం మూలాన, మునుపు తాండవిం చిన టెలిఫోన్ కరువు అంతరించింది. క్రొత్త టెక్నాలజీలు, అధునాతన సేవలు(Services)గా మనకు లభించాయి. మరీ గమనించవలసిన పరిణామం, ఈ సేవలన్నీ అతి సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చాయి.

1994లో నేషనల్ టెలికాం పాలసీ అమలులోకి వచ్చింది. అప్పుడు దేశంలో ఒక కోటి టెలిఫోన్లు న్నాయ్. ఇప్పుడు 90 కోట్లున్నయ్.

1994కు ముందు టెలిఫోన్ కావాలంటే, ఐదేళ్ల వరకూ వేచియుండాల్సి వచ్చేది. ఇప్పుడు ఐదు గంటల్లో టెలిఫోన్ సేవ లభ్యమవుతోంది.

1994లో ఒక సంవత్సరం టెలిఫోన్ సర్వీస్‌కు ఒక సంవత్సరపు తలసరి ఆదాయం(రూ. 10,000) కావలసివచ్చేది. (ప్రస్తుతం అదే సేవ, తలసరి ఆదాయం యొక్క 20వ వంతుతో లభిస్తోంది. అందుకే, ప్రతి వ్యక్తి చేతిలో సెల్‌ఫోనుంటోంది! 1994లో టెలిఫోన్ సాంద్రత వందమందికి ఒక్కటైతే, ప్రస్తుతం 75కు పైగా ఉంది!

1995-96లో సెల్‌ఫోన్లు రావడం ప్రారంభిం చాయి. ఒక్కొక్క దాని ధర రూ. 12,000లకు పైగా ఉండేది. ఇప్పుడు రూ.800కు అధునాతన సెల్‌ఫోన్లు లభ్యమవుతున్నాయ్.

సెల్‌ఫోన్లలో సంభాషణ సౌకర్యమే గాక, రేడియో, కెమెరా, ఇంటర్‌నెట్ కలయిక, దృశ్యం, టెలిఫోన్ డైరక్టరీ, క్యాలుక్యులేటర్, మేల్కొలుపు, గడియా రం, మార్గదర్శనం, ఇత్యాది పెరుగుతున్న వైవిధ్యం తో మెరుగులతో లభిస్తున్నయ్. మున్ముందు కంప్యూటర్ చేసే పనులన్నీ సెల్‌ఫోన్ ద్వారా చేయగలుగుతాం!

ఇన్ని ఉపయోగ సేవలందిస్తున్న టెలిఫోన్ కంపెనీల పరిస్థితులు ఆందోళనకర దశలో అడుగిడుతున్నయ్. ప్రైవేట్ కంపెనీలు మూడు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి, నెట్‌వర్క్స్ స్థాపించాయి. రూ. 2,00,000 కోట్ల అప్పుల్లో మునిగివున్నారు. (ఒక్క రిలయెన్స్ కాం యొక్క అప్పే రూ. 36,000 కోట్లు). ఏ ఒక్క కంపెనీ కూడా, ఈ 16 సంవత్సరాల్లో వాటాదార్లకు డివిడెండ్లు చెల్లించలా. ఇక రెండు, మూడు సంవత్సరాల్లో వాళ్ల లైసెన్సు కాలం పూర్తవుతుంది. క్రొత్త సేవలు ప్రవేశపెట్టడానికి గతి(స్పీడ్)ని పెంచడానికి 3G, 4G అనే తరాల నెట్‌వర్క్స్‌ను నిర్మించాలి. ఈ సేవలన్నింటికీ స్పెక్ట్రం (రేడియో తరంగ విస్తృతి - రేడియో బాండ్) కావాలి. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవాలనే దురాశతో, స్పెక్ట్రాన్ని వేలం వేస్తోంది; అవసరానికి మించిన సంఖ్యలో లైసెన్సు లిస్తోంది. (ఈ ప్రభుత్వం యొక్క నైజమే లైసెన్స్ - పర్మిట్ - కోటా సంపకం - దోచుకోవడం, దాచుకోవడంగా కన్పిస్తోంది). ఇందువల్ల పెట్టుబడు లు పెరగడం; వ్యయంతో పాటు ధరలు పెరగడం జరుగుతున్నది. ఇది విష పరిణామం.

పట్నాల్లో, నగరాల్లో టెలిఫోన్ సాంద్రత 90 నుండి 120 వరకూ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో సాంద్రత 40, 50 మధ్య ఉంది. గ్రామ ప్రాంతాల్లో సేవా విస్తరణకు కావలసిన పెట్టుబడులు ఎక్కువ; రాబడులు తక్కువ. కనుక, వేలం ద్వారా రేడియో స్పెక్ట్రం ఇవ్వడం తప్పని విజ్ఞులు మొరపెట్టు కుంటున్నా, ధనార్జనాపర ప్రభుత్వం వినిపించు కోవడంలా.

ఈ పరిస్థితుల్లో ఒకప్పుడు గుత్తాధిపత్యంతో వెలిగిన ప్రభుత్వరంగ టెలిఫోన్ కంపెనీలు - మహానగర టెలిఫోన్ నిగం (MTNL); భారత సంచార నిగం (BSNL) స్థితి దయనీయంగా యుంది. MTNL యొక్క వార్షిక నష్టాలు (రూ. 4,500 కోట్లు) ఆదాయానికి మించి ఉంటున్నయ్. BSNLకు వార్షిక నష్టం రూ. 10,000 కోట్లు! వీటిని రక్షించడానికి రూ. 20,300 కోట్లను దానం చేయమని మంత్రి కపిల్ సిబల్, ప్రధాన మంత్రిని కోరుతున్నారు. పనిలేని 350 జనరల్ మ్యానేజర్స్ ను, ఇళ్లల్లో కూర్చోబెట్టి, ప్రతి ఒక్కరకూ నెలకు దాదాపు రూ. 1,25,000లు చెక్కులద్వారా చెల్లిస్తోంది టెలికాం డిపార్ట్‌మెంట్!

1994లోని మొదటి నేషనల్ టెలికాం పాలసీ; 1999లోని రెండవ పాలసీ టెలికాం విప్లవాన్ని తీసికొచ్చాయి, వీటివల్ల ఐ.టీ. రంగానికి కావాల్సిన అంతర్జాతీయ బ్రాడ్‌బ్యాండ్ టెలికాం లింక్స్ ఏర్పడ్డాయి. టెలికాం, ఐ.టీ రెండూ కలిపి కోటి మందికి ఎక్కువ జీతాలున్న ఉపాధి కల్పిస్తున్నయ్. రూ. 3,00,000 కోట్ల విలువగల అంతర్జాతీయ ఐ.టీ. సేవలందిస్తున్నయ్. ఇటువంటి శుభపరిణా మాలకు, రాజకీయ చీడ, ధనార్జన దురాశలు తగలడం శోచనీయం. ఐ.టీ, టెలికాం సేవలను మానవ వికాసానికి తోడ్పడేవిగా గుర్తించి, వీటి నుంచి డబ్బు సంపాదించే చర్యలను ప్రభుత్వం కట్టిపెట్టాలి.

***- త్రిపురనేని హనుమాన్ చౌదరి,***
*ఫోను : 98490 67359*

నడుస్తున్న చరిత్ర మే సంచికలో విలువైన 8 పేజీల స్పందనలు మనస్సును కలచివేశాయి. ఒకటి గోండీ భాష లిపికి సంబంధించిన చర్చ. విశ్వనాథం గారి సూచన ఒక ప్రతిపాదన. దానితో మనము ఏకీభవించ వచ్చును లేదా విభేదించవచ్చును. కాని వ్యక్తిగత దూషణలకు, పరుష పద ప్రయోగాలకు తావు ఏది? అయినా గోండీ భాషకు ఇదివరకే ఒక లిపి ఉన్నదని రూఢి అయినప్పుడు లిపి గురించి ఇంత రాద్ధాంతం అవసరమా?

రెండోది శ్రీకృష్ణదేవరాయల కులనిర్ణయానికి సంబంధించినది. మన సమాజంలో కులానికి బలీయమైన స్థానం ఉంది. ఇది ఎప్పుడు ప్రారంభం అయ్యిందో, ఎలా కొనసాగుతోందో ఎవరూ ఇదమిత్థంగా చెప్పలేరు. అన్నీ ఊహా గానాలే! అయితే కులవ్యవస్థ మూలాన ఎన్నో అనర్థాలు దాపురించాయి. 20 శతాబ్దం పూర్వ భాగం దాకా అది సమాజ జీవనాన్ని అంతగా అతలాకుతలం చేయలేదు. స్వాతంత్ర్యా నంతరం వెర్రి తలలు వేసి, సమాజాన్ని కులాల వారీగా చీల్చి, కులాల పేరుతో అస్థిత్వాన్ని శాశ్వతంగా నిలిచిపోయేటట్లు (Perpetuate) ప్రయత్నాలు జరుగుతున్నాయి. తమ కులాన్ని ఎక్కడ మరచిపోతామో అని కొందరు పేరుచివర కులాన్ని అతికిస్తున్నారు. ఇది మంచి పరిణామము కాదని కుల నిర్మూలన సంఘాలు పోరాడుతున్నాయి. ఇట్టి పరిస్థితులలో రాయల కుల నిర్ధారణ అవసరమా? ఆలోచించండి.

**యద్దనపూడి మాధవరావు,** హైదరాబాదు.

సంపాదకీయం

# గిడుగు, గురజాడల సాక్షిగా ఉద్యమబాట పట్టాల్సిందే...

తెలుగు మహాసభల తీర్మానాల తర్వాత నాలుగు నెలల కాలంలో వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు, నిర్ణయాలలోని లోటుపాట్లను మే నెల సంచికలో వివరించుకొన్నాం. ముఖ్యంగా - భాషోద్యమకారుల తొలి నిక్కచ్చు(డిమాండు) - 'తెలుగుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ' విషయమై పాలకవర్గాల ఆలోచనలు, పరిణామాల గురించి మనం తరచి చూశాం. మే నెల 18న ఈ విషయమై ప్రభుత్వంలో అధికారుల స్థాయి సమావేశం జరిగి, తుది నిర్ణయం నిమిత్తం ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వెళ్లిందని తెలిసింది. మనం సందేహిస్తున్నట్లే - తెలుగు అంశం సాంస్కృతికశాఖతో చేరుతున్నది. మహా అయితే - అది 'తెలుగు భాష, సాంస్కృతిక మంత్రిత్వశాఖ'గా రూపొందవచ్చునని తెలుస్తున్నది. అంటే తెలుగుకు ప్రత్యేకంగా ప్రభుత్వ కార్యదర్శి స్థాయి అధికారి కాకుండా తెలుగు భాషా సాంస్కృతిక మంత్రిత్వశాఖలో తెలుగు వ్యవహారాలకు ఒక సెక్షన్ ఆఫీసర్‌తో సరిపెడతారు. ఇప్పటికి తెలుస్తున్నదానిని బట్టి - జరుగబోయేది ఇది. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్టు కేటాయింపు ఏమీ ఉండకపోవచ్చు.

మరి - తెలుగు అభివృద్ధి ప్రాధికార మండలి ఏర్పాటు ఏం కాబోతున్నది? తెలుగు శాఖతోపాటు తెలుగు అభివృద్ధి ప్రాధికారమండలి కావాలని మనం కోరుతున్నాం. కాని, ఆ రూపంలో అది రాదనీ, ఉన్న అధికార భాషా సంఘాన్నే కొనసాగించవచ్చుననీ తెలుస్తున్నది. ఇందువల్ల కొత్తగా ఒరిగేదేమీ ఉండదు.

2013కు తెలుగు భాషా సాంస్కృతిక సంవత్సరంగా బొట్టుపెట్టి - సాంస్కృతికశాఖ అధికారికంగా విడుదలచేసిన కార్యాచరణ ప్రణాళికలోనే భాష వికాసానికి, సాంస్కృతిక వికాసానికి కార్యక్రమం రెండు భాగాలుగా ఇవ్వడంలోనే మొత్తం పరిస్థితి అర్థమవుతుంది. అధికార బాధ్యతల్లో ఉండి ఈ ఉత్తర్వుల రూపకల్పనలో బాధ్యులైనవారి అవగాహన, చిత్తశుద్ధి స్థాయి సందేహాస్పదమవుతున్నది. తీర్మానాలు చేశారు గనుక - ఉత్తర్వులనిచ్చేయడం తప్ప తెలుగుకు సంబంధించిన లక్ష్యాల సాధనకు తగ్గట్లుగా వ్యవస్థల నిర్మాణానికి తగిన పూనిక కన్పించడం లేదు.

పాలన, బోధన రంగాల్లో తిరుగులేని విధంగా తెలుగును శక్తిమంతంగా వినియోగించడం భాషాప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వ మౌలిక బాధ్యత. అది ఏ పార్టీ ప్రభుత్వమైనా, ఎవరు నాయకత్వం వహించినా మార్పుకు వీలులేని రాజ్యాంగబద్ధ అంశం. దానినే విస్మరించి తూట్లు పొడిస్తే అది ప్రజాద్రోహమే అవుతుంది. భాషోద్యమకారులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నది అందుకే.

10వ తరగతి వరకు తెలుగు బోధనను తప్పనిసరి చేస్తున్నామని అందుకు ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇచ్చామని చేసిన బూటకపు ప్రచారం, ఇంటర్మీడియట్ నుంచీ తెలుగుకు జరుగుతున్న అన్యాయాన్ని తొలగిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పడం, తెలుగు చదవనివారిని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కాకుండా చేయాలనే విధానాన్ని చేపట్టకపోవడం - ఇవన్నీ పాలకుల తెలుగు వ్యతిరేక ధోరణికి అద్దంపడుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుతో భాషాపరమైన అనాథలుగా ఇతర రాష్ట్రాల్లో మిగిలిపోయిన మన తెలుగు తోబుట్టువుల కోసం చేయవలసినదేమీ చెయ్యకపోవడం, కనీసం తలపెట్టకపోవడం - తగనిపని. అంతర్జాతీయ తెలుగు కేంద్రాన్ని స్వతంత్ర వ్యవస్థగా అన్ని వనరులతో తీర్చిదిద్దవలసిన అవసరాన్ని ఎందుకు పట్టించుకోరు?

తెలుగు నేలపైన అన్నివిధాలుగా ఆంగ్లం పట్ల మోజును పెంచడంతోపాటు - తెలుగు పట్ల న్యూనతాభావాన్ని పెంచుతున్న పరిస్థితులను - అన్ని రంగాల్లోనూ మార్చాల్సిన బాధ్యతను ఎందుకు విస్మరిస్తున్నారు? ప్రపంచ తెలుగు మహాసభల పేరుతో, తెలుగు భాషా సంస్కృతీ వికాస సంవత్సరం పేరుతో కేవలం ప్రచార బాకా ఊదుతూ రానున్న ఎన్నికల్లో ఓట్ల సంపాదనే లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాలకుల చర్యల్ని ప్రజలు గమనిస్తున్నారు. భాషోద్యమకారులు, భాషాప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆందోళన మళ్లీ ఉద్యమరూపం తీసుకొంటే

సంపాదకీయం

- దీనికి పాలకులే బాధ్యులవుతారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ సభలో గౌరవనీయులైన మన రాష్ట్రపతి, మన రాష్ట్ర గవర్నరు, మన ముఖ్యమంత్రి మూడు సత్యాలను ప్రబోధించారు. 'పాలన, విద్యారంగాల్లో తెలుగు విస్తృతమవ్వాలి' అని ప్రణబ్ ముఖర్జీ గారు, 'తెలుగులో చదివితే ఉద్యోగాలు రావు అనే అపోహను పోగొట్టాలి' అని నరసింహన్ గారు ప్రభుత్వానికి హితవు పలికారు. కిరణ్‌కుమార్ రెడ్డి గారైతే 'మాతృభాషలో పునాది ఉంటేనే ఏ ఇతర భాషనైనా చక్కగా నేర్వగలుగుతాము' అని శెలవిచ్చారు. - ఈ మూడు మాటలూ చాలు, భాష విషయంలో మన రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యాన్ని నిర్ణయించడానికి. అయినా మన ప్రభుత్వ నేతలు అందుకు అనుగుణంగా ఎందుకు చర్యలు తీసుకోరు? సాక్షాత్తు - దేశాధ్యక్షుడు, గవర్నర్, ముఖ్యమంత్రి గారలు ప్రవచించిన సత్యాలకే విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఒక భాషాజాతిగా తెలుగు ప్రజల మనుగడ, అభివృద్ధి పట్ల నిబద్ధత లేకుండా వ్యవహరించడమంటే అది ప్రజావ్యతిరేక విధానమే. ప్రజల శ్రేయస్సును పట్టించుకోకపోవడమే. భాషోద్యమకారుల నిక్కచ్చులపై తప్పనిసరి పరిస్థితుల్లో స్పందించి, కొన్ని వాగ్దానాలు, తీర్మానాలు చేసి, ఇప్పుడు వాటిని నీరుగార్చే విధంగా వ్యవహరించడం కంటె అన్యాయం ఏమన్నా ఉందా?

తెలుగు భాష పట్ల, తెలుగు సాహితీ సంస్కృతుల పట్ల మన పాలకుల పట్టనితనానికి, తేలిక చూపుకు తాజా ఉదాహరణలుగా - గురజాడ, గిడుగుల స్వర్ణోత్తర శతజయంతుల సందర్భాలను చెప్పుకోవచ్చు. గిడుగు, గురజాడ లిద్దరినీ ఆధునిక తెలుగు భాషా సాహిత్య వెలుగులుగా గౌరవించుకొంటున్నాం. పోయిన ఏడాది గురజాడ విషయంలో ఈ ప్రభుత్వ బాధ్యులు ఎన్నో కబుర్లు చెప్పారు, ఎన్నో వాగ్దానాలు చేశారు! ఆచరణలో దిగజార్చేశారు. ఆ కథనంతా ఈ సంచికలోనే చదవండి. 2012 ఆగస్టు 29న ప్రభుత్వం జరిపిన హడావిడి సభ తర్వాత గిడుగును పూర్తిగా మర్చిపోయారు. నిజానికి, అప్పుడు ఆదుర్దాగా మొదలుపెట్టిన ప్రపంచ తెలుగు సభలకు ఒక విలువను సంతరింపజేసుకోవడానికి, భాషోద్యమకారులను దారితప్పించి, భాషాప్రియులను మోసం చెయ్యడానికి ఆ సందర్భాన్ని వాడుకొన్నారు తప్ప, ఆ తర్వాత చేసిందేమీ లేదు. గురజాడ, గిడుగు మరణించివుండవచ్చుగాని, తెలుగు భాషా సాహిత్య రంగాల్లో వారు ఎప్పటికీ దారిదీపాలే. అటువంటి వారి పేర్లను అడ్డంపెట్టుకొని ప్రచారాడంబరానికి పూనుకోవడం కంటె హీనం ఇంకేమైనా ఉంటుందా?

వాగ్దానాల అమలుకై భాషాభిమానులు, ఉద్యమకారులు ఓపిగ్గా ఎదురుచూశారు. చివరకు ప్రభుత్వ ఆలోచనా ధోరణి, చర్యలు ఏదిశలో ఉన్నాయో క్రమంగా స్పష్టం అవుతున్నది. అందువల్ల మళ్లీ ఉద్యమబాట చేపట్టకతప్పదు. గిడుగు, గురజాడల సాక్షిగా ఈ ఉద్యమం సాగాలి. వారు బడుగువర్గాల, స్త్రీల, పసివాళ్ల అభివృద్ధి కోసం తెలుగు భాషోద్యమాన్ని నిర్వహించారు. 'సామాన్యమైన తెలుగు భాషాబోధనను విద్యార్థులందరికీ నిర్బంధం చెయ్యాలని, తెలుగులోనే శాస్త్రవిజ్ఞానం అందించాలని, ఆ విధంగానే తెలుగు ఆధునికభాషగా అభివృద్ధిచెందుతుందనీ' వారు కర్తవ్యాన్ని ప్రబోధించారు.

నాడు గిడుగు వ్యవహార భాషోద్యమ లక్ష్యం సామాన్య ప్రజలు. దాని కొనసాగింపే నేటి తెలుగు భాషోద్యమం. కాని, సామాన్య ప్రజల స్వంత భాషను అణచివేయడం ద్వారా మొత్తం ప్రజాస్వామిక వ్యవస్థ మూల సూత్రాలనే మన పాలకులు అణచివేస్తున్నారు. పాలన, బోధన రంగాల్లో పూర్తిగా తెలుగే రాజ్యమేలాలి. ఇందుకు సరియైన వ్యవస్థల నిర్మాణం కోసమూ, ప్రజాచైతన్యాన్ని పెంపొందించడం కోసమూ ఉద్యమం సాగించాల్సిందే.

జూన్, జులైలలో ప్రభుత్వ ఆచరణలో ఏమన్నా ఆశలు బలపడేట్లుంటే సరే. లేకపోతే - రానున్న తెలుగు భాషాదినోత్సవం(ఆగస్టు 29) నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం(ఫిబ్రవరి 21) వరకు ఉద్యమం మళ్లీ పెద్ద ఎత్తున సాగాలి. మన రాజకీయ నాయకుల ప్రాణం అంతా ఓట్లలోనే ఉంటుంది. రానున్నది ఎన్నికల సమయం. ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా, బలంగా తీసుకువెళ్లవలసిన అదను ఇదే.

**31-05-2013**

సామల రమేష్‌బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

End of Preview.

Rest of the book can be read @

http://kinige.com/kbook.php?id=1829

* * *

Read other issues of Nadustunna Charitra @

http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60